క్లుప్తంగా

ఎరుకుల కులస్తులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలివ్వాలి



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఎరుకుల కులస్తులు

పార్వతీపురంటౌన్: ఎరుకుల కులస్తులకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎరుకుల కులస్తులతో కలసి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జియ్యమ్మవలస మండలంలోని తురకనాయుడువసలలో 30 ఏళ్లుగా ఎస్టీ ఎరుకుల కులస్తులు ఉన్నారని కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు. గత ఆరునెలలుగా వీఆర్ఓ చుట్టూ తిరుగుతున్నా మంజూరు చేయడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజేశ్వరి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పాలకవర్గ సమావేశాలు నిర్వహించండి



ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పార్వతీపురం టౌన్: ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలను నిర్వహించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యకమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తో ఐటీడీఏ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు నాలుగేళ్లుగా ఐటీడీఏ పాలక వర్గ సమావేశాలు నిర్వహించలేదని, ఈ క్రమంలో గిరిజనుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే పరిస్థితి లేదన్నారు. గిరి వెలుగుపై వస్తున్న ఆరోపణల పట్ల సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపుతున్న ఆదివాసీ జేఏసీ సభ్యులు

పార్వతీపురంటౌన్: షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీ జేఏసీ జిల్లా వైస్‌చైర్మన్ ఇంటికుప్పల రామకృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేసి జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీలో ప్రకటించిన ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఎస్టీ అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతాల ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని కోరారు. షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, ఆదివాసీ జేఏసీ సభ్యులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, తిరుపతి, ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థులు పండు, అనిల్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీఆర్ఏల శ్రమదానం

సీతానగరం: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం వీఆర్ఏలు శ్రమదానం చేశారు. కార్యాలయం ప్రాంగణంలో పేరుకుపోతున్న పిచ్చి మొక్కలను హెచ్‌డీటీ ఎ.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో తొలగించడంతో పాటు కొబ్బరి మొక్కలు, జామ మొక్కల చుట్టూ పేరుకు పోయిన చెత్తను తొలగించారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒడ్డి సూరయ్య, సింహాచలం పాల్గొన్నారు.

రికార్డుల భద్రత గాలికే



తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఒక గదిలో అస్తవ్యస్తంగా పడి ఉన్న పాత రికార్డులు

పార్వతీపురం రూరల్: రైతులకు సంబంధించి రెవెన్యూ రికార్డుల భద్రత గాలికే అన్న చందంగా ఉంది. పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఓలకు కేటాయించిన భవనంలో ఉన్న ఒక గదిలో అస్తవ్యస్తంగా పాత రికార్డులను పడవేశారు. ఆ గదిలో ఉన్న రికార్డులు చిందర వందరగా పడి చెదలపాలవుతున్నాయి. కార్యాలయానికి వచ్చి పోయేవారు చూసి విలువైన పాతరికార్డులను ఈ విధంగా నిర్లక్ష్యంగా వదిలేయడం పట్ల అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పోయాం..మోసం..!



12వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- డ్రైవర్లకు రూ.15వేలు హామీ అమలు చేయని ప్రభుత్వం
- హామీలు అమలుచేయలేదని వాపోయిన అన్ని వర్గాల ప్రజలు

సాలూరు:

టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీలను అమలుచేయలేదని, వారిని నమ్మి ఓటు వేసినందుకు మళ్లీ మోసపోయామంటూ సాలూరు పట్టణంలోని పలువురు ప్రజలు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ముందు వాపోయారు. ఈ మేరకు పట్టణంలోని 11,12,13 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు మున్సిపల్ వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ క్రమంలో వార్డుల్లో తిరిగిన రాజన్నదొరకు అడుగడుగునా స్థానిక మహిళలు, ప్రజలు హారతులు పట్టి నీరాజనం పలికారు. ఈ ఏడాది పాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయలేదని వాపోతూ, తమ సమస్యలను రాజన్నదొర ముందు ఏకరువు పెట్టారు.

డ్రైవర్లకు ఒక్క రుపాయి ఇవ్వలేదు

పలువురు వాహనాల డ్రైవర్లు రాజన్నదొరను కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. చంద్రబాబునాయుడు ఆటో, కారు, జీపు, లారీ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు కదా? ఇచ్చారా? అని రాజన్నదొర డ్రైవర్లను అడగ్గా ఒక్క రుపాయి కూడా ఇవ్వలేదని వాపోయారు.

ఆటోనగర్ అభివృద్ధి ఊసెత్తని మంత్రి

ఆటోనగర్ కోసం మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు కదా? అదైనా జరుగుతోందా? అని రాజన్నదొర అడగ్గా ఆ ఊసే లేకుండా పోయిందని వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.

జగన్ పాలనలో ప్రతినెలా సంక్షేమ పథకాలు

గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా మా బ్యాంకు ఖాతాల్లో నగదు జమయ్యేదని నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని మహిళలు వాపోయారు.

పాలనలో తేడాను గుర్తించండి

గత జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇచ్చిన హామీలను తొలి ఏడాదిలోనే అమలుచేశారని, నేటి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందని రాజన్నదొర వివరించారు. జగన్ పాలనకు, చంద్రబాబు పాలనకు మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు గిరిరఘు, మజ్జి అప్పారావు, ముషిడిపల్లి కృష్ణ, హరిబాలాజీ, గొర్లె జగన్, గొర్లె మధుసూదనరావు, దండి శ్రీనివాసరావు, గొర్లె వెంకటరమణ, కాకి పాండురంగారావు, పిరిడిరామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుచేయని ప్రభుత్వం

పలువురు ఉద్యోగులు రాజన్నదొరను కలిసి ఈ ప్రభుత్వం ఏడాది పాలన దాటినా నేటికీ పీఆర్సీ ఇవ్వలేదని, ఐఆర్ ఇవ్వలేదని వాపోయారు. ఈ క్రమంలో అడుగడుగునా రాజన్నదొరకు పలువురు ప్రజలు ఈ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడంతో తమకు జరిగిన మోసాలను, పడుతున్న ఇబ్బందులను తెలిపారు. దీనిపై రాజన్నదొర మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పాంప్లెట్లు ద్వారా ఇస్తున్నామని, క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసినా అవి వస్తాయని ఆ హామీలను అమలు చేయాలని కూటమి నేతలను అడగాలని సూచించారు.

ఎరువుల దుకాణం తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మక్కువ: స్థానిక శ్రీ విజయదుర్గా ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో సోమవారం వ్యవసాయ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాజాం సహాయ వ్యవసాయ సంచాలకుడు కె. చంద్రశేఖర్‌రావు, విశాఖపట్నం విజిలెన్స్ అధికారి పి.రమణయ్య, పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయాధికారి రవీంద్ర తనిఖీ చేపట్టారు. ఎరువుల దుకాణంలో ఎరువుల నిల్వ, బిల్లు పుస్తకం ఎరువుల లైసెన్స్, పురుగు మందుల స్టాక్ రిజిస్టర్, రసీదులు తనిఖీ చేయగా క్రిబ్కో కంపెనీ వారి బయో స్టిమ్యులెంట్ 146 బ్యాగ్‌లకు, ఫారం లేనందున స్టాప్ సేల్ నోటీస్ అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చింతల భారతి పాల్గొన్నారు.

విజిలెన్స్, వ్యవసాయ శాఖాధికారుల తనిఖీలు

సాలూరు: పట్టణంలోని ఎరువుల దుకాణంలో విజిలెన్స్, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పురుగు మందులు, ఎరువులు, స్టాక్ రిజిస్టర్లు ఈ సందర్భంగా పరిశీలించారు. జగన్నాథ ట్రేడర్స్‌లో బయోస్టిములెంట్ 6 లీటర్లకు పర్మిషన్ లేకపోవడం వల్ల స్టాప్‌సేల్ ఇష్యూ చేసినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో విజిలెన్స్, వ్యవసాయశాఖాధికారులు చంద్రరావు, రమణయ్య, రవీంద్ర, శిరీష, శ్రీను,తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పక్షోత్సవాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగభూషణరావు

సీతానగరం: జిల్లాలో పంచాయతీ పాలకవర్గాలు నిర్వహించనున్న పారిశుధ్య పక్షోత్సవాలను విజయవంతం చేయాలని డివిజినల్ గ్రామపంచాయతీ అధికారి నాగభూషణరావు కోరారు. ఈ మేరకు ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకూ గ్రామాల్లో నిర్వహించనున్న పారిశుధ్య పక్షోత్సవాలపై డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో సామాజికపరమైన అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులు నిర్వహించడానికి సత్వరచర్యలు చేపట్టనున్నామన్నారు. ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో కార్యదర్శులు పారిశుధ్య పనులు నిర్వహించడానికి ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఇప్పటికే పారిశుధ్య పనులు చేపట్టామని, అలాగే ఓవర్ హెడ్‌ట్యాంక్‌లను శుద్ధి చేయడం, ఇంటింటికుళాయిల మరమ్మతులు చేపట్టి సురక్షితమైన నీరు ప్రజలకు పంపిణీ చేయడానికి జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహించే పక్షోత్సవాలకు నిర్దేశించిన వివిధ శాఖలు, వైద్యారోగ్య శాఖ అధికార సిబ్బంది పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

104 సంచార చికిత్స వైద్య శిబిరం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎన్సీడీ పీఓ డాక్టర్ జగన్‌మోహనరావు

సీతానగరం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యానికి మెరుగైన వైద్య సేవలందించడానికి కృషి చేయాలని జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని నిడగల్లులో సంచార చికిత్స వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలు, అందిస్తున్న సేవలు మందులతోపాటు చికిత్స వివరాలు రికార్డుల్లో పరిశీలించారు. అనారోగ్య సమస్యలను స్పష్టంగా నమోదుచేయాలని ఆదేశించారు. వ్యాధిగ్రస్తులకు చేపడుతున్న రక్త పరీక్షలను పరిశీలించడం, బీపీ, సుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం ప్రతినెలా ఏమేరకు మెరుగవుతోందో పరిశీలించాలని వైద్యసిబ్బందికి సూచించారు. 104 వాహనంలో ఈసీజీ పరికరం పనితీరు, మందుల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య తనిఖీల వివరాలు అదేరోజు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఎన్సీడీ సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కేన్సర్ లక్షణాలు గుర్తిస్తే వెంటనే తెలియజేయాలని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతో చర్చించి వారికి అందుతున్న వైద్యసేవలపై ఆరాతీశారు. నిర్దేశించిన సమయం చూసి వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహార నియమావళిపై అవగాహన కల్పించారు. సంచార చికిత్స కార్యక్రమంపై ముందురోజు గ్రామస్తులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పెద్దింటి రమ్య, సూపర్‌వైజర్ గోపాలరావు, సీహెచ్ఓ ధరణి, 104 సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒప్పందాలు అమలు చేయకుంటే మరో పోరాటం



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పార్వతీపురంటౌన్: గత సమ్మె కాలం నాటి మున్సిపల్ కార్మికుల ఒప్పందాలు అమలు చేయకుంటే మరో పోరాటం తప్పదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు గొర్లి వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, రాజేష్, గంగరాజు, ఇప్పలమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళపై దాడి అమానుషం

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు



పార్వతీపురం రూరల్: కృష్ణా జిల్లా గుడివాడలో జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పల హారికపై టీడీపీ గుండాలు దాడికి పాల్పడం అమానుషమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రశ్నించే గొంతుకలపై దాడులకు పాల్పడుతోందని, రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని శ్రీనివాసరావు విమర్శించారు. నానా దుర్భాషలతో మహిళలను కించపరిచేలా ప్రవర్తిస్తున్న కూటమి ఎమ్మెల్యేలు ఇప్పటికైనా ప్రజల సమస్యలపై స్పందించి ప్రజలకు మంచి చేసే విధంగా పరిపాలన చేయాలని కోరారు. ఇఇ

మెట్టవలస విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు అందిస్తున్న సామగ్రి

సాలూరు: మండలంలోని తోణాం పంచాయతీ మెట్టవలస పాఠశాలలో విద్యార్థులకు బేతేల్ సోషల్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ సువార్తరావు, విజయమ్మ, ఎలిశాలు విద్యాసామగ్రిని అందించారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో సుమారు 60 మంది విద్యార్థులకు పలకలు, నోట్‌పుస్తకాలు, తదితర విద్యాసామగ్రితో పాటు బ్రష్, పేస్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీఐలో మిగులు సీట్లు భర్తీకి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్, కోపా(కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), డ్రెస్ మేకింగ్ ట్రేడ్‌లలో సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారు iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లను జూలై 22వ తేదీలోగా సమీపంలోని ఏదైనా ఐటీఐ వద్దకు వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులకు మాత్రమే జూలై 24వ తేదీన నిర్వహించే కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9491134464, 6304086821ను సంప్రదించాలని కోరారు.

అర్హత ఉన్నా పథకం వర్తించలేదు..



మైగాపు చంద్రమ్మ

వీరఘట్టం: మండల కేంద్రంలోని కొండవీధికి చెందిన మత్స్యకార మహిళ మైగాపు చంద్రమ్మకు ఇద్దరు పిల్లలున్నారు. చేపలు అమ్ముతూ జీవనం సాగిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈమెకు అమ్మఒడి పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.54 వేలు వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం మాత్రం ఈమెకు వర్తింపజేయలేదు. దీంతో ఆమె సోమవారం స్థానిక సచివాలయానికి వచ్చి అధికారులను నిలదీసింది. గత ప్రభుత్వంలో నాకు అమ్మఒడికి అర్హత ఉంటే ఇప్పుడెందుకు 'తల్లికి వందనం' రాలేదని ప్రశ్నించింది. ఉండడానికి సరైన ఇల్లు కూడా లేని నాలాంటి పేదవారికి పథకం వర్తింపజేయకపోవడం అన్యాయమని వాపోయింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటడంతో పథకం వర్తించలేదని అధికారులు చెప్పారని.. అయితే తన ఇంటిలో ఒక ఫ్యాన్, ఒక బల్బు, టీవీ మాత్రమే ఉన్నాయని తెలిపింది. తనలాగే చాలా మందికి పథకం వర్తించలేదని వాపోయింది.

వైఎస్సార్‌సీపీ మున్సిపల్ సమావేశాన్ని విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

వైఎస్సార్‌సీపీ పురపాలక స్థాయి విస్తృత సమావేశాన్ని విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో కలిసి తన క్యాంప్ కార్యాలయంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 17న గురువారం మధ్యాహ్నం 4 గంటలకు జిల్లా కేంద్రంలో గల లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్ వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి పురపాలక సంఘం వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు చందాన ఆనంద్, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్లి మాధవరావు, కౌన్సిలర్‌లు సువ్వాడ లావణ్య, యడ్ల త్రినాథ, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షఫీ, పట్టణ కమిటీ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

16న బలిజిపేట వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

బలిజిపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ, చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ వైఎస్సార్‌సీపీ బలిజిపేట మండల విస్తృత స్థాయి సమావేశాన్ని ఈ నెల 16న బుధవారం నిర్వహించనున్నామని సమావేశాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన వైఎస్సార్‌సీపీ మండల ముఖ్య నాయకులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బలిజిపేట మండల స్థాయి సమావేశంలో అరకు పార్లమెంట్ సభ్యురాలు గుమ్మా తనూజారాణి, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో బలిజిపేట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవలస మురళీకృష్ణ, జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, ఎంపీపీ గుడివాడ నాగమణి, వైస్ ఎంపీపీ వెలిది సాయిరాం, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పిట ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ పాలూరి నారాయణరావు, మండల పార్టీ ప్రతినిధులు, సీనియర్ నాయకులు పోల సత్యనారాయణ, గోళ్ల పకీరు నాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బెదిరించి పనిచేయించుకునే ధోరణి విడనాడాలి

- పీఆర్‌టీయూ డిమాండ్

పార్వతీపురం రూరల్: ఈనెల 10న జరిగిన మెగా పీటీఎం కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు తమ శక్తి మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులు, దాతలు, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో విజయవంతం చేశారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తవిటినాయుడు, విజయ్ అసోసియేట్ అధ్యక్షుడు సూర్యనారాయణ అన్నారు. అయితే ఆ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేస్తే అవి బాగోలేవని, మళ్లీ సరిచూసి బాగున్నవి అప్‌లోడ్ చేయాలని చెప్పడం సరికాదని ధ్వజమెత్తారు. కార్యక్రమం నిర్వహించే క్రమంలోనే ఫొటోగ్రాఫర్‌ను ఏర్పాటు చేస్తే బాగుండేదని, అలా కాకుండా ఉపాధ్యాయులు తీసిన ఫొటోలు అప్‌లోడ్ చేస్తే రాష్ట్రస్థాయిలో పంపించాలని, బాగోలేవని విద్యాశాఖ వంకలు పెట్టడం సరైంది కాదని, దీన్ని పీఆర్‌టీయూ ఖండిస్తోందన్నారు. బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయుల నెత్తిమీద రుద్ది అవే ప్రాధాన్యం అనేలా భావించడం సరికాదన్నారు. పాఠాలు సరిగ్గా చెప్పకపోతే సంజాయిషీ కోరడం సరైన విధానం కాని, ఫొటోలు సరిగ్గా లేవని సంజాయిషీ కోరడం సరైన విధానం కాదన్నారు. అన్ని యాప్‌ల నిర్వహణకు ప్రతి పాఠశాలకు అవసరమైన మొబైల్ లేదా ట్యాబ్‌లను సమకూర్చాలని, భవిష్యత్‌లో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కోరారు.

విద్యాభివృద్ధికి భాగస్వామ్యం అవసరం



మాట్లాడుతున్న ఏఎంఓ తేజేశ్వరరావు

సీతానగరం: విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతోనే విద్యాభివృద్ధి సాధ్యపడుతుందని డీఈఓ బి. రాజకుమార్, జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేట్ ఆర్ తేజేశ్వరరావు అన్నారు. కోర్సు డైరెక్టర్ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో మండలంలోని మరిపివలస షిరిడీ సాయి పాలిటెక్నిక్ కాలేజీలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు, పేరెంట్స్ భాగస్వామ్యంపై జిల్లా స్థాయి మొదటి విడత ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను సోమవారం డీఈఓ రాజ్‌కుమార్, ఏఎంఓ తేజేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి చేపట్టవలసిన అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. ఎస్ఎల్‌డీపీ పథకం అమలులో భాగంగా పాఠశాల నిర్వహణ, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై మాస్టర్ ట్రైనీలు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 15 మండలాల నుంచి మొదటి విడత శిక్షణ తరగతుల్లో 250 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 జి.సూరిదేముడు, మానిటరింగ్ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.



పాల్గొన్న 15 మండలాల ఉపాధ్యాయులు

బాపూజీ లెప్రసీ కాలనీకి మంచినీరు ఇవ్వాలి



డీఆర్వో హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణంలో తాగునీరు కరువైందని, ఇది చాలా దారుణమైన పరిస్థితి అని సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లె వెంకటరమణ అన్నారు. ఈ మేరకు సోమవారం సీపీఎం పార్వతీపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డీఆర్‌వో కె.హేమలతకు వినతిపత్రం అందించారు. ముందుగా మూడవ వార్డులో గల బాపూజీ కాలనీ ప్రజలు నీరు అందకపడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ కాలనీలో కేవలం 16 కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయని, వారంతా దివ్యాంగులు, వృద్ధులని గతంలో ప్రభుత్వం వారిని గుర్తించి ప్రత్యేకమైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రయత్నం చేపట్టిందని తెలిపారు. ఈ కాలనీలో నాలుగు కొళాయిలు మాత్రమే ఉన్నాయని, వాటిలో ఒకదాని ద్వారా మాత్రమే నీరు వస్తుందని, అది కూడా వారానికి ఒకసారి మాత్రమేనని, వచ్చిన నీరు కూడా చాలా చిన్నగా రావడంతో నీటికి చాలా అవస్థలు పడే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా పట్టణ నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి బాపూజీ కాలనీ ప్రజలకు తాగునీరు అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో కాలనీవాసులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు బి.సూరిబాబు, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.